# దశ తిరిగింది

- సుబేదారి సతీష్‌కుమార్

''ఈసారైనా తగుల్తుందంటావా?''

''ఖచ్చితంగా ఫస్ట్‌ప్రైజ్ తగులుతుంది. ముందు ఈ కట్టలో నుండి ఒక్కటి లాగు'' అన్నాడు బంగార్రాజు బొంగురు గొంతుతో.

ఆశ చావని శంకరం ఐదురూపాయల నాణెం బంగార్రాజు చేతిలో పెట్టి కట్టలోనుంచి ఒక టిక్కెట్టు లాగి చొక్కా జేబులో పెట్టుకుని లక్ష రూపాయల పోస్ట్ డేటెడ్ చెక్కు జేబులో వుందన్నంత ధీమాతో ఈల వేసుకుంటూ సైకిల్‌పై ఇంటికి పయనమయ్యాడు.

• • •

ప్రముఖ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ పట్టణ పొలిమేరల్లోని పూరిపాకల హామ్లేట్ అది. అందులో ఒక పాక శంకరానిది.

శంకరం భార్య బాలమణి ప్రతిరోజూ సాయంత్రం ముత్యంరావు తోటలోని పూలు తోకుగా కొని మాలల్లి, దేవాలయం ఎదుట కూర్చుని అమ్మేది. పూలు దొరకని రోజు బీడీలు చుట్టి పరోక్షంగా శంకరానికి సాయపడేది.

శంకరం ప్రతిరోజూ ఉదయం దేవాలయంలోని కోనేటి వద్దకు చేరుకుని భక్తులు అందులో వేసే చిల్లర నాణేలు ఏరుకోవడం అతడి నిత్యకృత్యం. అప్పుడప్పుడు పిసరంత బంగారమో, వెండో దొరికేది. అలా దొరికినరోజు వాడింట్లో పండగే.

• • •

మరుసట్రోజు ఉదయానే లాటరీ టిక్కెట్టు చొక్కా జేబులో నుంచి తీసి బంగార్రాజు చేతిలో పెట్టి దేవాలయం వైపు తిరిగి మనసులో రాజేశ్వరుడిని తలచుకుని ఫలితం కోసం ఆశగా బంగార్రాజు వైపు చూసాడు.

బంగార్రాజు దృష్టిలో శంకరం బంగారు గుడ్డు పెట్టే బాతు. బంగార్రాజు నిట్టూర్పు విడిచి తల అడ్డంగా ఆడించి ''రేయ్! శంకరం! ఈరోజు డబ్బులు పోయాయని నిరాశ చెందకురా, రేపు నీదే అనే ధీమాతో ఉండరా. మన సత్తిగాడు ఒకప్పుడు రిక్షా లాగేవాడు. ఈ రోజు స్వంత ఆటో తోలుతున్నాడు. ఇంతెందుకురా, దేవాలయంలోని గార్డు గఫూర్ నిరాశ పడకుండా టిక్కెట్లు కొని మొదటి బహుమతి గెలుచుకుని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి టెంకాయల బిజినెస్ పెట్టి లకారాలు సంపాదిస్తున్నాడు. ఈ తతంగమంతా నీకూ తెలుసు'' అన్నాడు.

బంగార్రాజు మాటల చాతుర్యానికి శంకరంలో ఆవిరైపోతున్న ఆశలకు తిరిగి జీవం వచ్చినట్టయింది. జేబులోంచి డబ్బులుతీసి అతడి చేతిలో పెట్టి కట్టలో నుంచి ఓ టిక్కెట్టు లాగి జేబులో కుక్కుకుని లాటరీ కొట్టు పక్కనే వున్న రామ్మూర్తివద్దకెళ్లి ''చిలుక ఎలా వుంది బావా?'' అన్నాడు.

''బాగానే ఉందిరా!'' పొడిగా అన్నాడు.

''ఏంటి బావా ఏదో ముక్తసరిగా మాట్లాడుతున్నావు!''

''నా చిలకతో జోస్యం చెప్పించుకోని నీతో నాకేంట్రా మాటలు!''

''అందుకే వచ్చాను బావ. నా జాతకం ఎలా వుందో కాస్త నీ చిలకనడిగి చెప్పు.''

రామ్మూర్తి మనస్సులో ఉబ్బితబ్బిబవుతూ ''రేయ్ శంకరం! ఈ ఊర్లో చాలామందికి జాతకాలు నా చిలకమ్మ చెప్పింది. జోస్యం నిజమై ఇప్పటికీ కార్లలో వచ్చి పోతూ వుంటారు'' అన్నాడు శంకరాన్ని బుట్టలో పడేయడానికి లేనిపోనివి కల్పించి.

శంకరం రెండ్రూపాయల నాణాన్ని రామ్మూర్తి చేతిలో పెట్టాడు. రామ్మూర్తి పంజరం తలుపులు తెరిచాడు. చిలుక ఒక కార్డు ముక్క అతడి చేతిలో పెట్టి సర్రున పంజరంలోకి వెళ్లిపోయింది.

రామ్మూర్తి కార్డు ముక్కను పరిశీలిస్తున్నట్లు నటిస్తూ ''త్వరలో నీ జాతకం తిరగబోతుంది. నువ్వు గొప్పవాడివైపోతావు. కానీ ఓ చిన్న అడ్డంకి వుంది. దాన్ని తొలగిస్తే ఇక నిన్నెవరూ ఆపలేరు'' అన్నాడు ముఖం నిండా గాంభీర్యాన్ని నింపుకుని.

''ఆ అడ్డేదో తొలగించు బావా'' ఆదుర్దాగా అడిగాడు.

''దానికి నూట పదహార్లు ఖర్చవుద్ది'' అన్నాడు.

''అంత డబ్బు ప్రస్తుతం నావద్దలేవు బావ. కేవలం పాతిక రూపాయలు మాత్రమే...''

''పోన్లేరా నీ డబ్బులెక్కడపోతాయిరా. పాతిక ఇచ్చి మిగతావి తర్వాత ఇచ్చుకో. నీపైన నాకు నమ్మకం వుంది'' అంటూ పెట్టెలో చేయి పెట్టి తీసి శంకరం ''ఇది శ్రీశైలం అడవుల్లో దొరికే అరుదైన రుద్రాక్ష. వారంరోజులపాటు నిద్రపోయే ముందు దిండు క్రింద పెట్టుకుని పడుకో. ఎనిమిదో రోజున దేముడికి దండం పెట్టి కోనేట్లోకి విసిరేయ్. ఆ తరువాత నీ దశ తిరిగి లక్షాధికారివైపోతావు'' అన్నాడు శంకరం చేతిలో పెడుతూ.

శంకరం అపురూపంగా దాన్నందుకుని చొక్కా జేబులో దాచుకుని ''నిజంగా నేను లక్షాధికారినైతే నీ చిలుక కాలికి బంగారు కడియం తొడుగుతాను'' అన్నాడు వెనుదిరుగుతూ.

శంకరం అలా వెళ్లగానే రామ్మూర్తి ఫక్కున నవ్వుకుని ''ఎదవకు రుద్రాక్షకి, ఎండిన సీతాఫలం పిందెకి తేడా తెలియదు. రాజేశ్వరుడా! ఇలాంటి వెర్రిబాగులోల్లని రోజుకి ఇద్దరు, ముగ్గురైనా తగిలేలా చూడు'' అని మనసులో వేడుకుని జేబులోంచి బీడీ కట్ట తీసి బీడీ వెలిగించి దమ్ము లాగాడు.

• • •

మూడురోజులు గడిచాయి.

కోనేటి అడుగుకంటా వెళ్లాడు శంకరం. చిల్లర కోసం వెదుకుతున్న అతడికి బంగారు గొలుసు కనిపించింది. దాన్నందుకుని బరువు అంచనా వేసాడు. దాన్ని మొలతాడుకు చుట్టుకుని నీటి పైకి వచ్చి పరిసరాల్ని పరిశీలించాడు.



కోనేటి మెట్లపై ఒక వ్యక్తి అటూ ఇటూ తిరుగుతూ శంకరాన్ని చూడగానే పిలిచాడు.

అతన్ని గమనించిన శంకరం గబుక్కున నీటిలోకి మునిగాడు.

శంకరం గుండె వేగంగా కొట్టుకోసాగింది. కాస్త కుదుటపడి నెమ్మదిగా నీటిలోనుంచి బయటకువచ్చాడు.

శంకరాన్ని చూడగానే ఆ వ్యక్తి ''మా అమ్మాయి గొలుసు నీటిలోకి జారిపోయింది. కాస్త వెతికి పెట్టవయ్యా'' అ భ్యర్ధి స్తూ అన్నాడు.

శంకరం అలాగే అన్నట్లు తలాడించి కోనేటి అడుగుకంటా వెళ్లాడు. అతడి ఆలోచనలు పరిపరివిధాలు పోతున్నాయి.

'వస్తువు పోగొట్టుకున్నవారు అడిగారు కాబట్టి వారికి ఇచ్చివేయడమే ధర్మం. ఇవ్వక

పోతే పరోక్షంగా అది దొంగతనమే అవుతుంది. కోనేటిని నమ్ముకున్నాడు. రాజేశుడి సన్నిధిలో ఇలాంటి పాపం చేయకూడదు' స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చి నీటిలోనుండి బయటకువచ్చి ఆ వ్యక్తి చేతిలో గొలుసు పెట్టాడు.

అతడు సంతోషంతో పొంగిపోతూ ఐదువందల రూపాయలు శంకరం చేతిలో పెట్టి ''నా పేరు విశ్వనాథ్. మీ ఊరికి కొత్తగా వచ్చిన గవర్నమెంటు డాక్టర్ని. తీరిగ్గా వచ్చి నన్ను కలుసుకో. ఆసుపత్రి క్వార్టర్స్‌లోనే వుంటాను'' అన్నాడు.

శంకరం అలాగేనన్నట్లు తలాడించి కోనేటివైపు చూసి అందులోకి వెళ్లాలనిపించక బట్టలు వేసుకుని బంగార్రాజు వద్దకెళ్లాడు.

శంకరాన్ని చూడగానే బంగార్రాజు ''రారా శంకరం. నీ టిక్కెట్టుకి పాతికవేలు తగిలాయి. ఆ టిక్కెట్టు ఇలాగివ్వు'' ఆతృతగా అన్నాడు.

''నిజంగానా!'' నమ్మశక్యం కానట్టుగా అన్నాడు టిక్కెట్టు బంగార్రాజు చేతిలో పెడుతూ.

''అవున్రా...నీ కోసం పాతికవేలు రెడీ చేసి పెట్టాను. తీసుకో'' అంటూ శంకరం చేతిలో పెట్టాడు.

శంకరం ఆనందానికి అవధుల్లేవు. డబ్బులు అందుకుని ఉల్లాసంగా ఇంటికి పయనమయ్యాడు.

శంకరం అలా వెళ్లగానే ''పిచ్చివెధవ! లక్ష రూపాయలు తగిలిన టిక్కెట్టుకి పాతికవేలు తగిలాయంటే నమ్మాడు. డెబ్బై ఐదు వేలు లాభం'' మనస్సులో అనుకున్నాడు బంగార్రాజు.

మరోవైపు శంకరం, బాలమణిలు కలసి పాతికవేలతో భవిష్యత్ కార్యక్రమాల ఆలోచనల్లో తలమునకలైనారు.

• • •

మరుసట్రోజు బంగార్రాజు న్యూస్‌పేపర్ తిరగేస్తూ అతడి దృష్టి 'లాటరీకి సవరణ' అన్న దగ్గర నిలిచిపోయింది. సవరణ చూడగానే బంగార్రాజు గుండెలో కలుక్కుమంది. నెత్తీనోరూ బాదుకున్నాడు.

అది శంకరాన్ని మోసంచేసి చేజిక్కించుకున్న లాటరీకి సవరణ.

టిక్కెట్టుకి డబ్బులు తగల్లేదని శంకరానికి ఇచ్చిన పాతికవేలు అడిగి తీసుకుంటే తన బండారం బైటపడి గొడవైపోతుందని, అది తన వ్యాపారానికి పెద్ద దెబ్బని ఆలోచించి మౌనంగా ఉండిపోయాడు బంగార్రాజు.

★

